# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 12-05-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.**

**2.** **రాష్ట్రంలో వైద్య విద్యాభివృద్ధి, నాణ్యమైన వైద్య సేవల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

**3.** **కొత్త వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియను 24 గంటల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని రవాణా శాఖ మంత్రి ఎమ్.రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు**

**4.** **రాష్ట్రంలో సాహస పర్యాటకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.**

==========================

రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రాజధానిలో నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవన సముదాయాలను అధికారులతో కలిసి మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... అమరావతి రాజధాని నిర్మాణం కోసం భూమి ఇచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపును పూర్తిగా లాటరీ విధానం ద్వారానే పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. ప్రజా ప్రతినిధుల భవనాల నిర్మాణాలను పూర్తి చేసి త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

--------------------------

రాష్ట్రంలో వైద్య విద్యాభివృద్ధి, నాణ్యమైన వైద్య సేవల విస్తరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ తెలిపారు. విజయవాడలో ప్రైవేట్ వైద్య, దంత కళాశాల సంఘం ప్రతినిధులు, వైద్య విద్య నిపుణులుతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. వైద్య విద్యలో ఆధునిక సాంకేతికత వినియోగం, విద్యార్థులకు మెరుగైన శిక్షణ, ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవల అందుబాటు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ... వైద్య విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా

శిక్షణ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం, ప్రైవేట్ వైద్య కళాశాలలు సమన్వయంతో పనిచేస్తే వైద్య రంగంలో మరింత పురోగతి సాధించవచ్చని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.

---------------------------

రాష్ట్రంలో కొత్త వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఇకపై 24 గంటల్లో పూర్తి చేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈరోజు ఒక ప్రకటనలో వెల్లడించారు. డీలర్ వద్ద తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసిన వాహనానికి ఇరవై నాలుగు గంటల్లోనే శాశ్వత రిజిస్ట్రేషన్, వాహన నంబర్ కేటాయింపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నిర్దేశిత గడువులో అధికారులు స్పందించకపోయినా దరఖాస్తులు ఆమోదం పొందే విధానాన్ని కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో కూడా ఆన్ లైన్ ద్వారా ఆమోద ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న వాహన రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించేందుకు ఈ కొత్త విధానం ఉపయోగపడుతుందని.. త్వరలోనే ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

---------------------------

రాష్ట్రం నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు రైలు అనుసంధానం కోసం ఏర్పాటు చేసిన కాకినాడ – హిసార్ కొత్త రెగ్యులర్ రైలు సర్వీసును కాకినాడ పార్లమెంట్ సభ్యులు ఉదయ్ శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని, ఇప్పటివరకు వారానికి ఒకసారి మాత్రమే నడుస్తున్న కాకినాడ –– హిసార్ రైలును రెగ్యులర్ సర్వీసుగా మార్చినట్లు తెలిపారు. దీని ద్వారా సుదూర ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొంటూ..

వాయిస్..30.. సెకన్లు

---------------------------

పార్వతీపురంమన్యం జిల్లా సాలూరులో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈరోజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాలూరులోని అభయ ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన మంత్రి ఆలయంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, ఆధ్యాత్మికత మానసిక ప్రశాంతతను, ధైర్యాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆంజనేయ స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో సాహస పర్యాటకాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో "జెట్‌స్కీ రైడ్స్ వాటర్ స్పోర్ట్స్" సేవలను ఈ రోజు ప్రారంభించనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యలంక బీచ్ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద 9 కోట్ల రూపాయలకు పైగా నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో బీచ్‌ను అభివృద్ధి చేసి బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ రోజ్‌గార్ & ఆజీవికా మిషన్ –గ్రామీణ చట్టం 2025 VB-G RAM G' అమలుకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ చట్టం జూలై ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుంది. ఇప్పటి వరకు అమల్లో ఉన్న ఎంఎన్ఆర్ఈజీఏ స్థానంలో ఈ కొత్త చట్టం అమలులోకి రానుంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ కుటుంబాలకు నూట ఇరవై ఐదు రోజుల వేతన ఉపాధికి ఈ చట్టం హామీ ఇస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ పథకం అమలుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 95 వేల 692 కోట్ల రూపాయలు కేటాయించామని పేర్కొంది. ఉపాధి హామీని వంద రోజుల నుంచి నూట ఇరవై ఐదు రోజులకు పెంచడం దీని ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం తెలిపింది.

--------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రెండు ఆరోగ్య కేంద్రాలు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నుంచి జాతీయ నాణ్యతా ధృవీకరణ పత్రాలను పొందాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. జిల్లాలోని చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నెల్లూరు నగర పరిధిలోని వేదాయపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపును పొందాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు ఆసుపత్రులకు ఈ గుర్తింపు లభించగా, అందులో జిల్లాకు చెందిన రెండు ఆరోగ్య కేంద్రాలు ఎంపిక కావడం హర్షణీయమన్నారు.

--------------------------

ప్రతి ప్రభుత్వ పథకం అర్హులందరికీ చేరేలా స్వర్ణ వార్డు – స్వర్ణ గ్రామం సచివాలయాలు సమన్వయంతో పని చేయాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులకు సూచించారు. స్వర్ణ వార్డు – స్వర్ణ గ్రామాల ద్వారా అందుతున్న సేవల పురోగతి, ఎన్నికల వార్డుల మ్యాపింగ్, మన మిత్ర శిక్షణ కార్యక్రమాలు వంటి అంశాలపై సంబంధిత అధికారులతో విశాఖ కలెక్టర్ కార్యాలయం నుంచి దృశ్య మాధ్యమం విధానంలో ఆయన ఈ రోజు సమీక్షించారు అలాగే మత్స్యకార లబ్ధిదారుల ఈ-కేవైసీ ప్రక్రియ, పీ4 బంగారు కుటుంబాల అనుసంధానం, కౌశలం పరీక్షలు, ఉద్యోగ మేళాల నిర్వహణ, ఆధార్ ప్రత్యేక శిబిరాల ఏర్పాటు వంటి కార్యక్రమాలపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

--------------------------

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ ఈరోజు మధ్యాహ్నం సమావేశం కానుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల తాగునీటి అవసరాలపై నిర్ణయం కోసం ఈ సమావేశాన్ని బోర్డు ఏర్పాటు చేసింది. హైదరాబాద్ జలసౌధలో జరిగే ఈ సమావేశంలో త్రిసభ్య కమిటీ కార్యదర్శి సతీష్, ఆంధ్రప్రదేశ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేష్ పాల్గొంటారు. మే నెలాఖరు వరకు సాగర్ కుడి కాల్వ నుంచి 10 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ తెలిపింది. జూలై వరకు శ్రీశైలం నుంచి 5, సాగర్ నుంచి 13 టీఎంసీలు కావాలని తెలంగాణ తెలిపింది. దీంతో రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలపై చర్చించి కమిటీ ఈరోజు నిర్ణయం తీసుకోనుంది.

====================